క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



ఎల్‌ఓసీ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరంలాంటిదని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. చైతన్యపురి డివిజన్ భవానినగర్ కాలనీకి చెందిన తిరుమల మైథిలీకి సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ. 2.5 లక్షల ఎల్ఓసీ పత్రాలను సోమవారం ఎమ్మెల్యే బాధితురాలి కుమారుడు హరీష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద ప్రజలకు అధునాతన వైద్య సేవలు పొందేందుకు సీఎం సహాయనిధి ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సదానంద్ రెడ్డి, పలం శ్రీనివాస్, ఫణీష్ పాల్గొన్నారు.

వసతుల కల్పనకు కృషిచేస్తా



కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎల్‌బీనగర్: సీనియర్ సిటిజెన్స్ భవనాల్లో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. సోమవారం సచివాలయనగర్ సీనియర్ సిటిజెన్ భవనంలో నిర్వహించిన సమావేశంలో కార్పొరేటర్ పాల్గొన్నారు. భవనంలో లిఫ్ట్ ఏర్పాటు చేయడంతో పాటు పెయిటింగ్స్ వేయాలని కార్పొరేటర్‌ను కోరగా త్వరలో భవనంలో మౌలిక సదుపాయాలు కలిపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సాంబశివరావు, కూర్మారావు, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీరామచంద్ర, శివప్రసాద్, రవీందర్‌రెడ్డి, నరసరాజు, శివాజీ పాల్గొన్నారు.

గౌరెల్లిలో చైన్ స్నాచింగ్



వివరాలు తెలుసుకుంటున్న ఏసీపీ కృష్ణయ్య

నాగోలు: ద్విచక్ర వాహనంపై వచ్చిన దుండగులు వృద్ధురాలు మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన నాగోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం. గౌరెల్లి గ్రామానికి చెందిన వీరమ్మ (65) సోమవారం మధ్యాహ్నం ఆధార్ కార్డు అప్‌డేట్ కోసం గ్రామంలో ఉన్న మీసేవ కేంద్రానికి వెళ్తుండగా బొడ్రాయి దాటిన తర్వాత ఆమె వెనకాల పల్సర్ బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు పుస్తెల తాడును తెచ్చుకొని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు.

కాంగ్రెస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

కొందుర్గు: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో రూ.60లక్షలతో చేపడుతున్న రోడ్డు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. అదేవిధంగా ముట్పూర్‌లో రూ.4లక్షలతో ఏర్పాటు చేసిన రెండు హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. అంతకుముందు కొందుర్గు బాలుర గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే భోజనాన్ని రుచి చూశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితో మండలంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు పురుషోత్తంరెడ్డి, రామయ్యాగౌడ్, జితేందర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, దర్శన్‌గౌడ్, కృష్ణయ్య, నర్సింలు, అంజయ్య, రవి, ద్విజేందర్, నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్‌ఫిల్టర్ అందజేత

కేశంపేట: మండల పరిధిలోని సంతాపూర్ ప్రాథమిక పాఠశాలకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సాజిద్ వాటర్ ఫిల్టర్ అందించారు. సోమవారం పలువురు నాయకులతో కలిసి ఆయన ఫిల్టర్‌ను ప్రారంభించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. చదువుల్లో రాణించి గ్రామానికి, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం అరుణ్, ఉపాధ్యాయులు శ్వేత, శివలీల, గ్రామస్తులు ప్రభాకర్‌రెడ్డి, రామస్వామి, బాల్‌రాజు పాల్గొన్నారు.

పత్తాలేని 'విజిలెన్స్'!



మహేశ్వరంలో లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ(ఫైల్)

- రేషన్ పర్యవేక్షణ కమిటీల నియామకంలో మీనమేషాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- బియ్యం పంపిణీపై కొరవడిన పర్యవేక్షణ
- హాస్టళ్లు, పాఠశాలలు, అంగన్‌వాడీలకు నాసిరకం సరుకుల సరఫరా

మండలం వివరాలు

మండలంలో రేషన్ దుకాణాలు	50
ఆహార భద్రత కార్డులు	17,625
అంత్యోదయ	2,471
అన్నపూర్ణ	10

మహేశ్వరం: రేషన్ బియ్యం, సరుకుల పంపిణీ పంపిణీని పర్యవేక్షించాల్సిన విజిలెన్స్ కమిటీలు పత్తాలేకుండా పోయాయి. వీటి నియామకానికి అధికారులు చొరవ చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతీ మూడు నెలలకోసారి సమావేశమయ్యే వీరు బియ్యం నాణ్యత, పంపిణీ తీరు, మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారం తదితర అంశాలపై చర్చించేవారు. పంపిణీలో ఏవైనా లోపాలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేవారు. కానీ కొన్నేళ్లుగా వీటిని నియమించలేదు. దీంతో డివిజన్, మండల స్థాయిలో రేషన్ పంపిణీపై పర్యవేక్షణ కరువైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగిన ఆహార సలహా సంఘాలను తొలగించిన తెలంగాణ ప్రభుత్వం వీటి స్థానంలో విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేసింది. కొన్నేళ్లుగా కొత్త కమిటీలను ఏర్పాటు చేయలేదు.

కమిటీలు ఇలా..

జిల్లా స్థాయి కమిటీలకు కలెక్టర్, డివిజన్ స్థాయి కమిటీకి ఆర్డీఓ, మండల స్థాయి కమిటీకి తహసీల్దార్ చైర్మన్లుగా ఉంటారు. మండల స్థాయిలో ఎంపీపీ సహ చైర్మన్‌గా ఉంటారు. జెడ్పీటీసీ సభ్యుడితో పాటు ముగ్గురు మహిళా ప్రతినిధులు, ఎంపీడీఓ, వ్యవసాయాధికారి, ఇద్దరు జర్నలిస్టులు, ఇద్దరు ఉపాధ్యాయులు, ఇద్దరు రైతులు, రేషన్ డీలర్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి, రాజకీయ పార్టీల నుంచి ఒకరు సభ్యులుగా ఉంటారు.

నాణ్యతపై ఆరోపణలు..

కమిటీల పర్యవేక్షణ లేకపోవడంతో నాణ్యత ప్రమాణాలపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాఠశాలలకు నాణ్యతలేని రేషన్ బియ్యం, సరుకులు సరఫరా అవుతుండడంతో విద్యార్థులు తరచూ అస్వస్థతకు గురవుతున్నారనే ఆరోపణలున్నాయి. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం గురించి పట్టించుకునేవారు లేరు. మండలంలోని కొన్ని రేషన్ దుకాణాల్లో నాసిరకం బియ్యం పంపిణీ అవుతున్నాయని కొంత మంది లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలు, హాస్టళ్లలో సన్నబియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వ ఆదేశాలున్నా కొన్ని చోట్ల దొడ్డు బియ్యం పంపిణీ చేస్తున్నారనే విమర్శలూ లేకపోలేదు.

త్వరలో ఏర్పాటు చేస్తాం



కలెక్టర్ అనుమతి తీసుకుని త్వరలోనే మండల, గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తాం. అనంతరం సమావేశాలు నిర్వహించి నాణ్యమైన బియ్యం పంపిణీకి కృషి చేస్తాం. రేషన్ దుకాణాలపై నిఘా పెంచి, ఎక్కడా అవకతవకలకు చాన్స్ లేకుండా చూస్తాం. – పి.చిన్న అప్పలనాయుడు, తహసీల్దార్, మహేశ్వరం

'బాబు' రుణం తీర్చుకునే పనిలో సీఎం

మాజీ మంత్రి సబితారెడ్డి

పహాడీషరీఫ్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రుణం తీర్చుకునేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేడిగడ్డను ఎండబెట్టే ప్రయత్నం చేస్తున్నారని మాజీ మంత్రి పి.సబితాఇంద్రారెడ్డి విమర్శించారు. జల్‌పల్లిలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. యూరియా కొరత, వరదలతో రైతులు పడుతున్న అంశాలపై అసెంబ్లీలో చర్చిస్తారనుకుంటే, కేవలం కేసీఆర్‌ను బదనాం చేసేందుకే సమయం వెచ్చించారన్నారు. ప్రతిపక్షం అసెంబ్లీకి రావాలని పదే పదే చెబుతూ.. తీరా వచ్చాక మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకపోవడం దారుణమన్నారు. మేడిగడ్డ పిల్లర్లకు మరమ్మతులు నిర్వహించేందుకు కాంట్రాక్టర్ ముందుకొచ్చినా ప్రభుత్వం అనుమతివ్వకపోవడం దురుద్దేశాన్ని తెలియజేస్తోందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రాజెక్ట్‌లో నీటిని నింపకుండా దిగువన ఉన్న బనకచర్లకు పంపి గురువు చంద్రబాబు రుణం తీర్చుకుంటున్నారన్నారు. సీబీఐ విచారణ చేయాలని.. బీజేపీ అడగడం, దానికి కాంగ్రెస్ తల ఊపుతూ అప్పగించడం చూస్తుంటే, రెండు పార్టీలు ఒక్కటేనని తెలుస్తోందన్నారు. నిజాలు మాట్లాడితే వినే ధైర్యం ఈ ప్రభుత్వానికి లేదన్నారు. ఈ విచారణలో కేసీఆర్ ముత్యంలా బయటపడతారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆశవర్కర్ల అరెస్ట్

- 'చలో హైదరాబాద్' నేపథ్యంలో అదుపులోకి...
- పోరాటం ఆగదని ఆందోళనకారుల వెల్లడి



కందుకూరు పీఎస్‌లో ఆశవర్కర్లు

కందుకూరు: మండలానికి చెందిన పలువురు ఆశ వర్కర్లను సోమవారం ఉదయం పోలీసులు అరెస్టు చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం వీరు చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమం నేపథ్యంలో ఆశ వర్కర్లు ముంతాజ్‌బేగం, అప్రోచ్, సురేఖ, జయసుధ, అనిత, విజయలక్ష్మి, చంద్రకళ, మాధవి, సంధ్య తదితరులను అరెస్టు చేశారు. ఈసందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ ముందస్తు అరెస్టులను తీవ్రంగా ఖండించి మాట్లాడారు. ప్రజా ఉద్యమాలను పోలీసులతో అణిచివేయాలనుకోవడం ప్రభుత్వ అవివేకమని మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు.

ఇళ్ల స్థలాలకు కబ్జా చూపాలి



నేదునూరు పరిధిలోని ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

- సీపీఎం నేతల డిమాండ్
- లేదంటే ఆందోళన తప్పదని హెచ్చరిక

కందుకూరు: పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలకు కబ్జా చూపాలని సీపీఎం మండల కమిటీ సభ్యుడు అంకగళ్ల కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని నేదునూరు అక్బర్‌జా రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 9లోని ప్రభుత్వ భూమిని సీపీఎం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సర్వే నంబర్ 9లో గత ప్రభుత్వం 155 మంది పేదలకు 60 గజాల చొప్పున కేటాయిస్తూ సర్టిఫికెట్లు జారీ చేసిందన్నారు. ఏళ్లు గడుస్తున్నా వీటికి పొజిషన్ చూపించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు వెంటనే సర్వే చేయించి పేదలకు స్థలాలు కబ్జా చూపాలని, లేనిపక్షంలో ఆందోళన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ఉన్ని సాయిలు, నాయకులు వంగూరు యాదయ్య, కె.రాములు, చెన్నయ్య, రాములు, మైసయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేశ్‌బాబు



బాలాపూర్ గణనాథుడి సన్నిధిలో రేషన్ డీలర్లు

మహేశ్వరం: రేషన్ డీలర్లకు గౌరవ వేతనం రూ.5వేలు వెంటనే ప్రకటించాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేశ్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం బాలాపూర్ గణనాథుడికి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరిస్తానని హామీలు ఇచ్చి విస్మరించిందన్నారు. రేషన్ డీలర్లకు కనీస గౌరవ వేతనం రూ.5వేలు ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టి.. ఇప్పటివరకు ఇవ్వకుండా కాలయాపన చేస్తోంన్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులిమామిడి లక్ష్మీనారాయణ, జాయింట్ సెక్రటరీ భానుచందర్ గౌడ్, జిల్లా ఉపాధ్యాక్షుడు శశిధర్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

పాత విద్యుత్ వైర్లను తొలగించాలని వినతి

శంకర్‌పల్లి: పట్టణం, మండలంలో కాలం చెల్లిన పాత విద్యుత్ వైర్లను తొలగించి, కొత్త వైర్లను బిగించాలని సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు నరేశ్ కోరారు. ఈ మేరకు సోమవారం శంకర్‌పల్లి విద్యుత్ శాఖ ఏఈ ప్రదీప్, మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్‌కు ఆయన వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రవీందర్, మహేందర్‌రెడ్డి, వైభవ్ పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పించండి



కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంను సన్మానించిన నాయకులు

కడ్తాల్: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిరుపేద యువతకు రుణాలు ఇప్పించి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని పలువురు కాంగ్రెస్ నాయకులు కార్పొరేషన్ చైర్మన్ నాగరి ప్రీతంను కోరారు. సోమవారం ఆయన మండల కేంద్రానికి వచ్చిన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, రేవంత్ మిత్రమండలి వ్యవస్థాపక అధ్యక్షుడు చందోజీ, మాజీ సర్పంచ్ శంకర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అశోక్, బ్లాక్ కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు రాజేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేసే వరకు ఉద్యమం



నిరసన వ్యక్తం చేస్తున్న టీఎస్‌జీఓ నాయకులు

ఆమనగల్లు: సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పింఛన్ విధానం అమలు చేసే వరకు పోరాటం చేస్తామని టీఎస్‌జీఓ జిల్లా కార్యవర్గ సభ్యుడు శేఖర్ స్పష్టం చేశారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ.. సోమవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులు జైపాల్, వెంకటయ్య, కృష్ణ, నాగమణి, రవి, పర్వతాలు, విష్ణు, అలివేలు, చైతన్య, చంద్రశేఖర్, కృష్ణయ్య, మెర్సి, కుసుమలత, బాలరాజు, మధుకర్, సునీత, సుశీలమ్మ, వేణు, సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

8న పింఛన్ల పెంపు సదస్సు



బాచుపల్లిలో పింఛన్ లబ్ధిదారులతో ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు

- లబ్ధిదారులు తరలిరావాలని ఎమ్మెస్పీ పిలుపు
- సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్

కందుకూరు: పింఛన్ల పెంపుపై కందుకూరులో ఈనెల 8న నిర్వహించనున్న సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మెస్పీ జిల్లా ఇన్‌చార్జి మాసాయిపేట యాదగిరిమాదిగ, జిల్లా అధ్యక్షుడు రావుగల్ల బాబుమాదిగ పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం మండల పరిధిలోని బాచుపల్లిలో పింఛన్ లబ్ధిదారులతో సమావేశమై మాట్లాడారు. ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి లబ్ధిదారులకు పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. కానీ ఇప్పటికీ మాట నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. లక్ష్యాన్ని సాధించేలా లబ్ధిదారులు అందరూ కలిసిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడు గానుగపేట జంగయ్యమాదిగ, ఎమ్మార్పీఎస్ మండల మల్లేపల్లి కృష్ణమాదిగ, నాయకులు యాచారం పాండుమాదిగ, బాచుపల్లి అధ్యక్షుడు గుమ్మడవెల్లి వెంకటేశంమాదిగ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఏకంకండి



అభివాదం చేస్తున్న కార్మిక సంఘం, సీఐటీయూ నాయకులు

కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్‌రావు

కడ్తాల్: సమస్యల పరిష్కారం కోసం భవన నిర్మాణ కార్మికులు ఐకమత్యంతో ముందుకు సాగాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్డులను తీసుకుని భాగస్వామ్యులు కావాలని సూచించారు. బోర్డును ప్రైవేట్ సంస్థలకు అప్పగించవద్దని, ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని కోరారు. అనంతరం కార్మికుల మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెంటయ్య, ప్రధాన కార్యదర్శిగా మహేశ్, ఉపాధ్యక్షులుగా బాలరాజు, కొండల్, సత్యంగౌడ్, సంయుక్త కార్యదర్శిగా అర్జున్, కార్యదర్శిగా సిలారి, సహాయ కార్యదర్శిగా జంగయ్య, కోశాధికారిగా బండి యాదగిరి, సభ్యులుగా వీరేశ్, జంగయ్య, అంజయ్య, సత్యం, మహేశ్, కృష్ణయ్య, మల్లేశ్, దర్గయ్య, శివయ్య, జంగయ్య, కృష్ణయ్య, జంగయ్య, కృష్ణయ్యలను నియమించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు జగన్, సంఘం జిల్లా నాయకురాలు పార్వతి, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.



బడంగ్‌పేట్: బాలాపూర్ గణనాథుడి సన్నిధిలో ఏఐసీసీ సభ్యుడు వంశీచంద్‌రెడ్డి



పహాడీషరీఫ్: జల్‌పల్లిలో గణనాథుడి పూజలో పాల్గొన్న భక్తులు

వైభవంగా గణేశ్ వేడుకలు

గణేశ్ నవరాత్రి వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు ప్రముఖులు ఏకదంతుడిని దర్శించుకున్నారు. మరో పక్క గణనాథుల నిమజ్జన వేడుకలు సైతం ఉత్సాహంగా సాగుతున్నాయి. యువత, చిన్నారులు నృత్యాలతో హోరెత్తిస్తున్నారు.



బడంగ్‌పేట్: బడంగ్‌పేట్ గణనాథుడి సన్నిధిలో మాజీ కార్పొరేటర్ కృష్ణారెడ్డి, నిర్వాహకులు



బడంగ్‌పేట్: శ్రీహిల్స్ కాలనీలో..



పహాడీషరీఫ్: శ్రీరాంకాలనీలో..

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



జల్‌పల్లి చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

పహాడీషరీఫ్: వినాయక నిమజ్జనోత్సవాల సందర్భంగా నియోజకవర్గంలోని చెరువుల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. జల్‌పల్లి పెద్ద చెరువు కట్టపై కొనసాగుతున్న నిమజ్జన సరళిని సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా నిమజ్జనానికి వస్తున్న భక్తులు ఎక్కడి నుంచి వస్తున్నారు.. ఇక్కడి ఏవైనా ఇబ్బందులున్నాయా..? అని ఆరాతీశారు. చెరువులో స్వచ్ఛమైన నీరు ఉన్నందున చాంద్రాయణగుట్ట నుంచి నిమజ్జనం చేసేందుకు వచ్చామని పలువురు భక్తులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మిషన్ కాకతీయ ద్వారా చెరువులకు పూర్వ వైభవం తీసుకొచ్చారన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని స్వచ్ఛమైన నీరు కలిగిన చెరువులలోనే నిమజ్జన ప్రక్రియ చేపడుతున్నామని తెలిపారు. నవరాత్రుల పాటు గణనాథుడిని ప్రతిష్ఠించే భక్తులు స్వామివారిని స్వచ్ఛమైన నీటిలో నిమజ్జనం చేయాలని కోరుకుంటారన్నారు. మున్సిపల్, పోలీస్, విద్యుత్ విభాగాలు సమన్వయం చేసుకుంటూ శాంతియుత వాతావరణంలో కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు. భక్తులు ప్రమాదాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. జల్‌పల్లి చెరువులో త్వరలోనే మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్టీపీ)ను ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే మంజూరైన రూ.9 కోట్లు వెచ్చించి ఈ చెరువును సుందరీకరిస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్, నాయకులు సూరెడ్డి కృష్ణారెడ్డి, యంజాల అర్జున్, షేక్ అఫ్జల్, పల్లపు శంకర్, నవపేట ఆంజనేయులు, గోపాల్ రెడ్డి, సయ్యద్ హుస్సేన్, ఇద్రీస్, గుండు నర్సింగ్, మేరాజ్ ఖాన్, సయీద్ పటేల్, మన్నాన్ తదితరులు పాల్గొన్నారు.